# భద్రాద్రికి సీఎం రాక...

- రామాలయ అభివృద్ధికి నేడు శంకుస్థాపన
- రూ.586 కోట్లతో పనులకు శ్రీకారం



**భద్రాచలం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** "రామనామం రమ్యం... సీతమ్మ సాన్నిధ్యం సౌభాగ్యం" అన్న భావరాగంలో నేడు భద్రాద్రి ఆధ్యాత్మికోత్సాహంతో అలరారనుంది. పుష్కరకాలంగా ఎదురుచూస్తున్న రామభక్తుల ఆకాంక్షలు ఫలించే వేళగా, భద్రాచలం అభివృద్ధికి భారీ నిధుల ప్రవాహానికి నేడు నాంది పలుకనుంది. భద్రాచలం రామాలయ

మిగతా 2 లో...



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 27 | మార్చి | 2026 ◆ పేజీలు : 7



2 లో..

# చౌదరి ఫామ్ హౌస్ వెనుక.... ఇసుక మాఫియా హవా

- దోపిడీకి గురౌతున్న సంజయ్ నగర్ పరిధిలోని మొర్రేడు వాగు
- వెంచర్ మార్గంలో రాత్రింబవళ్లు ఇసుక రవాణా
- ట్రాక్టర్ల అతివేగం... ప్రాణాలకు ముప్పు
- మొర్రేడు వాగు దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?
- ట్రెంచ్‌లతో అడ్డుకుంటామని అధికారులు హామీ

సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రేడు వాగు నిరంతరం అక్రమ ఇసుక దందాకు గురవుతోందని స్థానిక గ్రామస్తులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక రవాణా కొనసాగుతుండగా సంబంధిత అధికారులు మాత్రం దీనిపై కట్టడి చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

# సీతారాముల కళ్యాణం చూద్దాం రారండి..

- నేడు భద్రాద్రిలో సీతారాముల దివ్య పరిణయం
- అభిజిత్ లగ్నంలో జరగనున్న కల్యాణ మహోత్సవం
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- రూ.586 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**భద్రాచలం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వసంతపక్ష బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరగనుంది. ఈ వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో

మిగతా 7 లో...



# అమరావతి-జగదల్పూర్ రవాణా విస్తరణకు ప్రణాళికలు

- రామాలయ అభివృద్ధి నమూనా ఆవిష్కరణ



2 లో...



# ఇదేం పనయ్య ప్రశాంత్..!

- కోర్టు ఆదేశాల పేరుతో ఇంట్లోకి చొరబాటు
- సొంత కుటుంబసభ్యులనే ఇబ్బంది పెట్టె ప్రయత్నాలు
- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అడ్డుగా బెదిరింపులకు మాస్టర్ ప్లాన్ వేసిన నేతలు
- ఆస్తి తగాదాలో తలదూర్చి బెదిరింపులకు పాల్పడిన కుల సంఘ మహిళా నేతలు
- బాధిత కుటుంబానికి ఇంకా దిక్కెవరో....?

**కొత్తగూడెం, మార్చి 26 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం బూడిదగడ్డ ప్రాంతంలో కుటుంబ తగాదా నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు ఆదేశాల పేరుతో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి బెదిరింపులకు పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుల కథనం ప్రకారం ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, బంధువులు కలిసి నివసిస్తున్న సమయంలో 2017లో ఆడెపు రవి, మాటేటి శ్రీనివాసరావు అనే వ్యక్తులు పల్నాటి ప్రశాంత్ వద్ద డాక్యుమెంట్ల ద్వారా ఒప్పందం కుదుర్చుకుంటు రెండు ఇండ్లను స్వాధీన హక్కులను కల్పించుకున్నట్లు తెలిపారు. అందులో ఒక ఇంటిపై ఆన్లైన్ పట్టా అయిందని తెలిపారు. మరొక ఇల్లు ఆన్లైన్ పట్టా కొరకు

మిగతా 2 లో...

## అమరావతి–జగదల్పూర్ రవాణా విస్తరణకు ప్రణాళికలు


- రామాలయ అభివృద్ధి నమూనా ఆవిష్కరణ

**భద్రాచలం, మార్చి 26, ప్రజా జ్యోతి:** అమరావతి–జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం భద్రాచలంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా అధికారులు చేస్తున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న బస్సు సౌకర్యాలతో పాటు భవిష్యత్తులో రైలు, విమాన మార్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని, అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. వీఐపీలు, వీవీఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వక సేవలు అందించాలని ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని కరకట్టల బలోపేతం, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇదే సందర్భంలో రూ.580 కోట్లతో చేపట్టనున్న రామాలయ అభివృద్ధి పనుల నమూనా చిత్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రికి సీఎం రాక...

(మొదటి పేజీ తరువాయి...)

అభివృద్ధికి నేడు కీలక ఘట్టం చోటుచేసుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలానికి విచ్చేసి శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. భద్రాచలం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.586 కోట్లను కేటాయించింది. ఈ పనులను మూడు విడతలుగా పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించింది. తొలి విడతలో రూ.351 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం జీవో నెం.167ను జారీ చేసింది. ఈ తొలి విడతలో గోదావరి ఘాట్ అభివృద్ధికి రూ.75 కోట్లు, ఆలయ విస్తరణ పనులకు రూ.180 కోట్లు, పరిపాలన భవనం మరియు ఇతర మౌలిక వసతుల కోసం రూ.96 కోట్లు కేటాయించారు. ఈ పనులకు నేడు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. భద్రాచలం రామాలయ అభివృద్ధి కోసం స్థానిక భక్తులు, ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఆలయ పరిసరాల్లో సౌకర్యాల కొరత, యాత్రికులకు ఇబ్బందులు వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని పలుమార్లు విజ్ఞప్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో భారీ నిధుల కేటాయింపు పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.





- దోపిడీకి గురౌతున్న సంజయ్ నగర్ పరిధిలోని మొర్రేడు వాగు
- వెంచర్ మార్గంలో రాత్రింబవళ్లు ఇసుక రవాణా
- ట్రాక్టర్ల అతివేగం... ప్రాణాలకు ముప్పు
- మొర్రేడు వాగు దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?
- ట్రెంచ్‌లతో అడ్డుకుంటామని అధికారులు హామీ

# చౌదరి ఫామ్ హౌస్ వెనుక.... ఇసుక మాఫియా హవా

**సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రేడు వాగు నిరంతరం అక్రమ ఇసుక దందాకు గురవుతోందని స్థానిక గ్రామస్తులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక రవాణా కొనసాగుతుండగా సంబంధిత అధికారులు మాత్రం దీనిపై కట్టడి చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

- కొత్తగూడెం, ప్రజాజ్యోతి

స్థానికుల వివరాల ప్రకారం హమాలీ కాలనీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థకు చెందిన చౌదరి ఫామ్ హౌస్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన వెంచర్ మార్గం ద్వారా అక్రమంగా రహదారి ఏర్పరచుకుని ఇసుక దందా కొనసాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. భారీ ఎత్తున ఇసుక తరలింపులు జరుగుతుండటంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని వారు వాపోతున్నారు. ఈ దందాపై అధికారులకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక దందా వెనుక ఉన్న ప్రభావశీలులు ఎవరు? వారికి సహకరిస్తున్న అధికారులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### ››› ప్రమాదాలకు దారి తీస్తున్న ఇసుక రవాణా

అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్లు రాత్రి సమయంలో అధిక వేగంతో నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి ఘటనలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గుర్తు చేస్తూ మరిన్ని ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయకపోవడం వల్లే ఈ అక్రమ దందా నియంత్రణలోకి రాకపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ››› ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం: హమాలీ కాలనీ సెక్రటరీ నూతక్కి భవాని



హమాలీ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రహదారిపై అతివేగంగా సంచరిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేందుకు చర్యలు చేపడతామని సెక్రటరీ నూతక్కి భవాని తెలిపారు. గ్రామ పంచాయతీపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ ఇసుక ర్యాంప్ తమ పరిధిలో లేదని స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాక్టర్ల అతివేగాన్ని నియంత్రించేందుకు స్థానిక పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ ఇసుక తరలింపులను అడ్డుకునేందుకు లక్ష్మిదేవిపల్లి తహసీల్దార్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్, పాలక వర్గం సమన్వయంతో సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

### ››› ఇసుక తొలకాలను అడ్డుకుంటాం: సంజయ్ నగర్ సెక్రటరీ పోతు అన్వేష్



హమాలీ కాలనీ పరిధిలోని చౌదరి ఫామ్ హౌస్ వెనుక మట్టి రహదారి ద్వారా మొర్రేడు వాగు నుండి జరుగుతున్న అక్రమ ఇసుక తరలింపులను అడ్డుకుంటామని సంజయ్ నగర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ పోతు అన్వేష్ తెలిపారు. ఇసుక రవాణా జరుగుతున్న విషయం తమ దృష్టికి రాకపోవడం వల్ల ముందస్తు చర్యలు తీసుకోలేకపోయామని ఆయన పేర్కొన్నారు. ఇకపై లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్, పోలీస్ అధికారుల సహకారంతో అక్రమ ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సంజయ్ నగర్ సర్పంచ్, పాలక వర్గం సమన్వయంతో మొర్రేడు వాగులోకి వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

### ››› అక్రమ ఇసుక దందాపై కఠిన చర్యలు: లక్ష్మీదేవి పల్లి మండల తహసీల్దార్ శిరీష



మొర్రేడు వాగు పరిధిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని లక్ష్మీదేవి పల్లి మండల తహసీల్దార్ శిరీష తెలిపారు. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టామని రెవెన్యూ సిబ్బంది మరియు పోలీస్ అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. అక్రమంగా ఇసుక తరలింపులో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొర్రేడు వాగులోకి వాహనాలు ప్రవేశించకుండా అవసరమైన చోట ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాద్రిలో సమగ్ర ఏర్పాట్లు

- **భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 26:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీరామనవమి, మహా పట్టాభిషేక ఉత్సవాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.గురువారం మిథిలా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వీఐపీలు, వీవీఐపీలు, సాధారణ భక్తులు అందరూ సౌకర్యంగా పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. భక్తులకు మర్యాదపూర్వక సేవలు అందించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. సీతారాముల కళ్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భక్తుల సౌకర్యార్థం రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని కరకట్టల బలపరచడం, ఘాట్‌ల నిర్మాణం, మౌలిక వసతుల విస్తరణ వంటి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అభివృద్ధి ప్రణాళికల నమూనాలను మంత్రి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.ఇదే సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల పంపిణీ, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

## మహిళలు స్వయంకృషితో ఎదగాలి

- **ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 26 – ప్రజాజ్యోతి:** మహిళలు స్వయంకృషితో ఎదిగి కుటుంబ పోషణ, స్త్రీ ఆరోగ్య సంరక్షణ లో ఎలా శ్రద్ధ తీసుకోవాలని ఎల్. మాలతి సూర్యనారాయణ, కే.విజయ వెంకటేశ్వర్లు, ఏసిఎంఓ డాక్టర్ ఎం.ఉష సూచించారు. కొత్తగూడెం ఇల్లందు క్లబ్ లో గురువారము సింగరేణి కార్పొరేట్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిలుగా వారు పాల్గొని మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సృష్టి లో స్త్రీ శక్తిని మించినది ఏమి లేదు అని, మహిళలు స్వయంకృషితో ఎదిగి కుటుంబ పోషణ , స్త్రీ ఆరోగ్య సంరక్షణ లో ఎలా శ్రద్ధ తీసుకోవాలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మీనాక్షి, అరుణ, పార్వతి, మాధవి, లక్ష్మి, మధులత, లేడీస్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- **డ్రోన్ కెమెరాలు,సీసీటీవీల పర్యవేక్షణలో భద్రాచలం పట్టణం**
- **భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా 2000 మంది పోలీసులతో ప్రత్యేక నిఘా**
- **ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు : ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాచలం, మార్చి 26, ప్రజా జ్యోతి:** నేడు జరగనున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం, శనివారం నాడు జరగనున్న పట్టాభిషేకం మహోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు.ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.సుమారుగా రెండు వేల మంది పోలీసులతో ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తుల కొరకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ , ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు.భద్రాచలం పట్టణం మొత్తం డ్రోన్ కెమెరాలు,సీసీటీవీ లతో నిరంతర పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు.భద్రాచల పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు ఈ రెండు రోజులపాటు పోలీసు వారు విధించే ట్రాఫిక్ ఆంక్షలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.

## న్యాయవాదుల గుమస్తాల సంఘం ఎన్నిక





**ఇల్లందు, మార్చి 26, ప్రజా జ్యోతి:** ఇల్లందు కోర్టు న్యాయవాదుల గుమస్తాల సంఘాన్ని గురువారం కోర్టు ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తివారి శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శిగా దాసరి శరత్, గేమ్స్ సెక్రటరీగా గాదెపాక సాయికుమార్, కోశాధికారిగా గిరిధర్, గౌరవ సలహాదారుగా శివ ప్రసాద్ పాసి లను ఎన్నుకున్నట్లు ఎన్నికల నెమలి ఎల్లయ్య తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదుల గుమస్తాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. న్యాయవాదుల గుమస్తాలకు ఎలాంటి సమస్యలు వచ్చిన న్యాయవాదులతో కలిసి వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపుతానని స్పష్టం చేశారు. న్యాయవాదుల గుమస్తాల నూతన కార్యవర్గాన్ని నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్, ఉపాధ్యక్షురాలు వి. అరుణ, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఖాసీమ్, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ నవీన్ కుమార్, కోశాధికారి ఎస్ బన్సీలాల్ తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూక్య రవి నాయక్





**ఇల్లెందు, మార్చి 26, ప్రజాజ్యోతి:** ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూక్య రవికుమార్ నాయక్ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 10 ఓట్ల మెజార్టీతో రవికుమార్ నాయక్ ఘనవిజయం సాధించారని, మొత్తం మొత్తం 50 ఓట్లకు 48 ఓట్లు పోల్ అవ్వగా భూక్య రవికుమార్ నాయక్ 29 ఓట్లు, కీర్తి కార్తీక్ కు 19 ఓట్లు పోలయ్యాయని అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్, సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ తెలిపారు. అదేవిదంగా ఉపాధ్యక్షురాలుగా వి అరుణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కె మహమ్మద్ ఖాసీమ్, సహాయ కార్యదర్శిగా సిహెచ్ నవీన్ కుమార్, కోశాధికారిగా సపావత్ బన్సీలాల్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ మాట్లాడుతూ న్యాయవాద సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని, కోర్టులో బెంచ్, న్యాయవాదులకు మధ్య సమన్వయకర్తగా పనిచేస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు న్యాయవాదులకు అందేలా చూస్తానని తెలిపారు. కౌన్సిల్ సభ్యులతో పాటు సీనియర్ న్యాయవాదుల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ అభివృద్ధికై ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. తనను గెలిపించిన బార్ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

## కొబ్బరి రైతులకు కేంద్ర సబ్సిడీ వరం

- – వినియోగించుకోవాలని అధికారుల పిలుపు



**దమ్మపేట,మార్చ్.26(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో కొబ్బరి రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకం ద్వార ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొబ్బరి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ రెడ్డి పాల్గొని రైతులకు సబ్సిడీ వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొబ్బరి సాగు ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.42,000 విలువ చేసే ఎరువులను ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. అలాగే కొత్తగా కొబ్బరి తోటలు ఏర్పాటు చేసే రైతులకు ప్రతి మొక్కకు రూ.350 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయబడుతుందని చెప్పారు.దమ్మపేట,అశ్వరావుపేట మండలాల్లో సుమారు 1500 హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతోందని, ఈ అవకాశాన్ని రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, రావి రఘు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ సత్యం,గణపా రాము,కర్లపూడి బాలు,పలువురు స్థానిక రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చీమలపాడు ఇసుక ర్యాంపు సమస్యను వెంటనే పరిష్కరించాలి

- పీసా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నేతలు కల్పన, శివ ప్రశాంత్



**భద్రాచలం టౌన్, మార్చి 26 ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చీమలపాడు ఇసుక ర్యాంపు చుట్టూ ముసురుకున్న వివాదాలను తక్షణమే పరిష్కరించాలని, ఆదివాసీల ప్రయోజనాలను కాపాడాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకురాలు కల్పన, డివిజన్ నాయకులు మునిగేల శివ ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలంలో ఐటీడీఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు.అనంతరం జిల్లా నేతలు కల్పన , శివ ప్రశాంత్ మాట్లాడుతూ చీమలపాడు ఇసుక ర్యాంపు సొసైటీ గత రెండేళ్లుగా సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బైలా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొయ్యూరు గ్రామస్తులను తొలగించినప్పటికీ, ఉన్నతాధికారులు పాత కమిటీ సభ్యులకే ఎందుకు మద్దతు తెలుపుతున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మహాజన సభ నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకుని, బ్యాంక్ అకౌంట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అధికారులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు.టీజీయండీసీ అధికారులకు పాత కమిటీపై ఉన్న "ప్రేమ" విడ్డూరంగా ఉందని నేతలు ఎద్దేవా చేశారు. "కాలపరిమితి తీరిపోయిన పాత కమిటీతోనే అధికారులు ఎందుకు ప్రయాణం చేయాలనుకుంటున్నారు? జేసీబీలు, టిప్పర్ల అద్దెలు పాత కమిటీ వారికి భారమవుతున్నాయని సొంత సభ్యుల కంటే అధికారులే ఎక్కువగా బాధపడటం వెనుక ఆంతర్యమేమిటి ?" అని వారు నిలదీశారు. అధికారుల తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని, దీని వెనుక అధికార పార్టీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల రక్షణ కోసం ఉన్న పీసా (PESA) చట్టాన్ని అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్‌కు ఈ చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, చీమలపాడు సమస్యపై స్పందించకపోవడం దారుణమని అన్నారు.తక్షణమే జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి చీమలపాడు సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో గిరిజన సంఘాలతో కలిసి ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## భలే భద్రగిరి మార్ట్ ...!






- అటవీ వస్తువులు లభ్యం
- గిరిజన ఉత్పత్తుల మార్కెట్
- గ్రామీణ జీవనోపాధికి సాధికారత
- ఐటీడీఏ పీవో రాహుల్ మరో నూతన ఆవిష్కరణ

**భద్రాచలం, మార్చి 26, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో గిరిజన మ్యూజియం హాట్ టాపిక్. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు సజీవ సాక్ష్యం.ఇక ఇప్పుడు గిరిజన ఉత్పత్తులకు భద్రాచలం మార్కెట్ కానుంది. అదే భద్రగిరి మార్ట్. "నూతన ఆవిష్కరణల ఆఫీసర్" గా పేరొందిన భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఐఏఎస్ మరో అద్భుత సృష్టి భద్రగిరి మార్ట్. గ్రామీణ జీవనోపాధికి సాధికారత కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ మార్ట్ నెలకొల్ప బడింది.గిరిజన స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించటం, మార్కెటింగ్ చేయటం ఈ గిరి మార్ట్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**భద్రాచలంలో గిరి మార్ట్///**

భద్రాచలం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో భద్రగిరి గిరి మార్ట్ ను ఏర్పాటు చేశారు. గతంలో గిరిజన బజారుగా ఉన్న భవనాన్ని అందచందంగా తీర్చిదిద్దారు. ఇందు కోసం ఐటీడీఏ నిధులను వెచ్చించింది. పట్టణాలకు మాత్రమే పరిమితమైన వివిధ రకాల మార్ట్ లు భద్రాచలంలో కూడా అందుబాటులోకి తీసుకురావాలని ఐటిడిఏ పిఓ బి. రాహుల్ ఐఏఎస్ భావించారు. నూతన వ్యవస్థల సృష్టికర్తగా పేరుందిన రాహుల్ ఐఏఎస్ భద్రగిరి మార్ట్ కు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం ఐటీడీఏ అధికారుల,ఉద్యోగుల సేవలను వినియోగించారు. గిరిజన మార్ట్ లో సకల సౌకర్యాలు కల్పించారు. అద్భుతంగా భవనాన్ని తీర్చిదిద్దారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భద్రగిరి మార్ట్ స్థానికులకు ఎంతగానో ఉపకరించనుంది

**గిరిజన ఉత్పత్తుల మార్కెట్///**

భద్రాచలంలో భద్రగిరి మార్ట్ ఏర్పాటు అద్భుతమనే చెప్పాలి. అడవిలో దొరికేటువంటి ప్రయోజనకరమైన ఎన్నో రకాల అవసర వస్తువులు ఇక్కడ లభ్యం కానున్నాయి. గిరిజన ఉత్పత్తులు, స్వయం సహాయక బృందాల ఉత్పత్తులు, సాధారణ వస్తువులు, వెదురు వస్తువులు, అటవీ తేనే, అడవి పసుపు, పచ్చళ్ళు,స్నాక్స్, హస్తకళలు, హెర్బల్ సబ్బులు, కిరాణా వస్తువులు, చిరుధాన్యాలు, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు ఇలా అనేక ప్రజా ఉపయోగకర వస్తువులు ఇక్కడ లభించనున్నాయి.ఈ వస్తువులకు సరసమైన ధరలను కేటాయించి వీటిని విక్రయించేలాగా చర్యలు చేపట్టారు. శ్రీరామనవమి రోజు నుంచి భద్రగిరి మార్ట్ స్థానికులకు అందుబాటులోకి రానుంది.

**రాహుల్ మరో నూతన ఆవిష్కరణ**

ఇది భద్రాచలంలో ఐటీడీఏ పీవో రాహుల్ గాంధీ అధికారం చేపట్టినప్పటి నుంచి గిరిజన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ వస్తున్నారు.భద్రాచలంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు ద్వారా గిరిజన సంస్కృతిని సజీవంగా కాపాడగలిగారు. ట్రైబల్ మ్యూజియం ఒక పిక్నిక్ స్పాట్ గా మారింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో యాత్రికులు ట్రైబల్ మ్యూజియాన్ని దర్శిస్తున్నారు. ఇది ఐటీడీఏకు ఎంతగానో గుర్తింపు తెచ్చింది. గిరిజనుల తమ ఇలవేల్పుల చరితను వెలికి తీసేందుకు రాహుల్ ప్రత్యేక బృందాలతో గిరిజనుల చరితను తెలిపే పుస్తకాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు.తెలుగు భాష ఉన్నతికి ఆయన చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఉద్దీపకం పుస్తకం ద్వారా గిరిజన బిడ్డల ఆంగ్ల విద్య ప్రోత్సాహానికి విశేషమైన కృషి చేశారు. ఇలా విద్యారంగానికి పెద్దపీట వేస్తూనే...మరోవైపు గిరిజనుల వ్యవసాయ ప్రగతికి కూడా చర్యలు చేపట్టారు.అంతేకాకుండా వారు పండించిన పంటలకు, అడవుల్లో దొరికే ఉత్పత్తులకు మార్కెట్ ప్రోత్సాహాన్నిఅందించాలనే ఉద్దేశంతో భద్రగిరి మార్టును ఏర్పాటు చేసి మరో నూతన ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని సక్సెస్ చేయడం కోసం పిఓ రాహుల్ అహర్నిశల కష్టపడ్డారు. ఈ మార్ట్ ద్వారా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశం కలగనుంది. భద్రాచలానికి వన్నె తెచ్చే విధంగా అనేక నూతన ప్రయత్నాలకు, సక్సెస్ కు వారధిగా నిలుస్తున్న ఐటీడీఏ పిఓ రాహుల్ ఐఏఎస్ ను తప్పకుండా అభినందించాల్సిందే.

## మధ్యాహ్న భోజన కార్మికులకు వేతన పెంపు డిమాండ్

- సిఐటియు ఆధ్వర్యంలో ఎంఈవోకు వినతి పత్రం



**దమ్మపేట,మార్చ్.26(ప్రజాజ్యోతి):** మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.10,000 వేతనం పెంచాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవో జగపతికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కమిటీ కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్ లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపుపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించిందని అన్నారు. మార్కెట్ లో ధరలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల మెనూ ఛార్జీలు పెంచకపోవడం వలన వంట ఏజెన్సీలపై భారం అధికమవుతోందని పేర్కొన్నారు.అలాగే వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, విద్యార్థులకు మెనూ ఛార్జీలు పెంచాలని, గుడ్లను ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యవతి, జయ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికలు పూర్తి

- అధ్యక్షుడిగా గొంది మురళి మోహన్ , ప్రధాన కార్యదర్శిగా లక్కినేని నరేంద్ర బాబు ఎన్నిక





**దమ్మపేట,మార్చ్.26(ప్రజాజ్యోతి):** దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ కు సంబంధించిన నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి.అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో గొంది మురళి మోహన్ విజయం సాధించారు. మొత్తం 13 ఓట్లలో 12 ఓట్లు పోలవగా, మెజారిటీ ఓట్లు ఆయనకు లభించాయి. ఈ ఫలితంతో ఆయనను సభ్యులు అభినందించారు.మిగతా పదవులకు ఏకగ్రీవంగా సభ్యులను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా ముప్పుడి శ్యామ్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్కినేని నరేంద్ర బాబు, కోశాధికారిగా తమ బాలరాజు, కార్యదర్శిగా తుమ్మ రామారావు బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే క్రీడల కార్యదర్శిగా తిర్నాటి సంజయ్, మహిళా ప్రతినిధిగా తనగాల అరుణ కుమారి, ఈసీ సభ్యుడిగా దార మాధవరావు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి నల్లపు ఉదయ్ కుమార్ వెల్లడించారు.ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గాన్ని స్థానిక న్యాయవాదులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గొంది మురళి మోహన్ మాట్లాడుతూ, బార్ అసోసియేషన్ అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, షేక్ దర్గావలి, నల్లపు ఉదయ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి మహోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- : జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాచలం, మార్చి 26, ప్రజా జ్యోతి:** శ్రీరామనవమి మహోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, ట్రయల్ రన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిమిషానికో ప్రణాళిక ప్రకారం అధికారులు సమీక్షించారు. హెలిప్యాడ్ వద్ద దిగిన ప్రాంతం నుంచి ఐటీసీ గెస్ట్ హౌస్ వరకు, అక్కడి నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వెళ్లే మార్గాలు, దర్శనం అనంతరం నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమం, అలాగే మిథిలా స్టేడియంలో జరగనున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు.భక్తుల రద్దీ, వీఐపీ కదలికలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. అన్ని మార్గాల్లో బారికేడ్లు, భద్రతా తనిఖీ కేంద్రాలు, పార్కింగ్ సదుపాయాలు, అత్యవసర సేవల అందుబాటుపై సమగ్రంగా సమీక్షించారు.మిథిలా స్టేడియంలో నిర్వహించిన భద్రతా సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది వివిధ శాఖల అధికారులకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, శ్రీరామనవమి మహోత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ భద్రతా పరంగా ఎటువంటి లోపాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు పోలీసు సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలి

- •టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్



**టేకులపల్లి,మార్చి25,ప్రజాజ్యోతి** : తెలంగాణ రాష్ట్రంలోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలలను నిర్వహిస్తున్నట్లుగానే తెలంగాణలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటి పూట నిర్వహించేటట్లుగా ఉత్తర్వులు ఇవ్వాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు 6నుండి 14 సంవత్సరాల వయసు కలిగిన ప్రాథమిక,ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వేసవి ఎండల దృష్ట్యా ఒంటి పూట బడులు నిర్వహించి, చిన్న వయసు కలిగిన 3 నుండి 5 సంవత్సరాలలోపు అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రం రెండు పూటలు నిర్వహించడం సరైనది కాదని ఆయన ఆరోపించారు. అరకొర వసతులతో విద్యార్థులు ఈ ఎండలను తట్టుకొని రెండు పూటలు అంగన్వాడీ కేంద్రంలో ఉండలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పిల్లలకు వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురవుతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందు తున్నారని ఆయన అన్నారు. ఈ ఎండ వేడిని దృష్ట్యా పెట్టుకొని అంగన్వాడి కేంద్రాలు ఒంటి పూట మాత్రమే నిర్వహించేటట్టు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. వేసవి ఎండల దృష్ట్యా అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు సరైన పిల్లలకు అవసరమైన వసతులు కల్పించాలి.

# కోతులు దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు





**చంద్రుగొండ,ప్రజా జ్యోతి . మార్చి 26** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలోని దడిగల సత్యం వృద్ధిని ఇంటి ఆవరణలో మామిడి చెట్టుకు కోతుల నుండి రక్షణ కోసం వల ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం కోతులు అటుగా వెళుతూ మామిడి చెట్టుపై ఎక్కడాను ప్రయత్నించగా పెద్ద కోతులు తప్పించుకోగా చిన్న కోతి పిల్ల వలలో చిక్కుకుంది. త్వరలో చికెన్ కోతి పిల్ల అరవటం చేస్తున్నడంతో వృద్ధుడు సత్యం కర్రతో దానిని అందించడానికి వెళ్లగా ఒక్కసారిగా కోతులు గుంపు మీద పడి ఒళ్లంతా కరిచి గాయాల పాలు చేశాయి. చుట్టుపక్క వారు కర్రలతో కోతులను దూరంగా అల్లించి, వృద్ధుడును చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. గ్రామంలో కోతులు సమస్య అధికంగా ఉన్న గ్రామపంచాయతీ అధికారులు, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడంలేదని గాయాల పాలైన వృద్ధుడు ఆవేదనతో తెలిపారు. గ్రామంలో కోతుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ ద్వితీయవార్షికోత్సవం

- సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు





**టేకులపల్లి,మార్చి 25,ప్రజాజ్యోతి:**మండలంలో గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ ద్వితీయ వార్షికోవత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ సీతారాం నాయక్ పాల్గొని, మాట్లాడుతూ గ్రావిటి ప్రీమియర్ స్కూల్ చైర్మన్ పుణ్యనాయక్ విద్యార్థులకు విద్యా బోధన చేపట్టి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక విభాగం,క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులను చదువుతో పాటు ఇతర అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు.విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండి అద్భుత విజయాలు సాధిస్తారని అభిప్రాయ పడ్డారు.దేశాన్ని మార్చుకునే శక్తి విద్యార్థులకు ఉందన్నారు.ఈకార్యక్రమంలో గ్రావిటి స్కూల్ చైర్మన్ బోడ పుణ్య నాయక్, ప్రిన్సిపాల్ బ్రాహ్మచారీ, గ్రావిటీ స్కూల్ కరస్పాండెంట్ బోడ గంగ, గణేష్ మహరాజ్ , సీతారామ్ , చిక్క వెంకటేశ్వర్లు, నెల్లూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు





**చర్ల, మార్చ్ 26: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో నక్సలైట్ నిర్మూలన ప్రచారం గణనీయమైన విజయాన్ని సాధించింది. పోలీసు సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచా మాట్లాడుతూ గత రెండు రోజుల్లో, రాజ్ నంద్ గావ్-కాంకేర్ సరిహద్దు డివిజన్ కు చెందిన ఐదుగురు మావోయి స్టు కార్యకర్తలు మిలిటరీ కంపెనీ 05కు చెందిన ఒకరు హింసను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకున్నారు అని లొంగిపోయిన కార్యకర్తలలో ఏసీఎం మంగేష్ పొడియామి, గణేష్ వీకే, మంగ్తి జుర్రి, హిద్మే మార్కమ్ అలియాస్ సునీతా రాజే, మరియు పీపీసీఎం స్వరూప ఉసెండి (పీఎల్ జీఏ కంపెనీ 05) ఉన్నారు అని వారు ఒక ఎస్ ఎల్ ఆర్ రెండు .303 రైఫిళ్లతో సహా మొత్తం మూడు ఆయుధాలతో లొంగిపోయారు అని అన్నారు .పోలీసుల ప్రకారం ఈ కార్యకర్తల నుండి అందిన సమాచారం ఆధారంగా ఆ ప్రాంతంలో చురుకుగా ఉన్న ఇతర మావోయిస్టులను సంప్రదించి వారు కూడా లొంగిపోయేలా పోలీస్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు అని లొంగిపోయిన కార్యకర్తలందరికీ సామాజిక పునరావాసం కల్పించి, ఆయుధాలను లాంఛనంగా అప్పగించిన తర్వాత ఒక కార్యక్రమం నిర్వహించబడుతుంది అని అన్నారు .బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పట్టలింగం మాట్లాడుతూ మిగిలి ఉన్న మావోయిస్టు కార్యకర్తలు హింసను విడనాడి జనజీవన స్రవంతిలో తిరిగి చేరాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస విధానం కింద సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ప్రభుత్వ పునరావాస విధానం కారణంగా గత 26 నెలల్లో 2,700 మందికి పైగా మావోయిస్టు కార్యకర్తలు జనజీవన స్రవంతిలో చేరడం ఈ ప్రచారంలో ఒక పెద్ద విజయంగా పరిగణించబడుతున్న విషయం అని అన్నారు .

# గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- - సీడీపీఓ తార



**టేకులపల్లి,మార్చి25,ప్రజాజ్యోతి:** గర్భిణులు తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ప్రాజెక్ట్ సీడీపీఓ తార సూచించారు. టేకులపల్లి మండల పరిధిలోని బొమ్మనపల్లి సెక్టార్, కొత్తతండ-1అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.ముఖ్యంగా గుడ్డు,పాలు,చేపలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆరునెలల పిల్లలకు అన్నప్రాసన్న, మూడేళ్లు దాటిన పిల్లలకు అక్ష్యరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో బొమ్మనపల్లి సర్పంచ్ సుజాత,ఉప సర్పంచ్ శంకర్,కొత్తతండా సర్పంచ్ తారాచంద్,ఉప సర్పంచ్ కుమార్, సెక్రటరీ కృష్ణ చైతన్య, అంగన్వాడీ టీచర్స్ విజయలక్షి ,విజయ,పద్మ, రోజా,రమణశ్రీ,గర్భిణీలు, పిల్లలు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్దే లక్ష్యం

- ప్రతి సమస్యను పరిష్కరిస్తాం
- మున్సిపల్ మొదటి సాధారణ సమావేశంలో చైర్ పర్సన్






**ఇల్లందు, మార్చి 26, ప్రజాజ్యోతి:** మున్సిపల్ అభివృద్దే తమ నూతన పాలకవర్గ లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో నెలకొన్న ప్రతి ఒక్క సమస్యను తప్పని సరిగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ స్పష్టం చేశారు. గురువారం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో నెలకొన్న శానిటేషన్, వీధిలైట్లు, మంచినీటి సమస్య, కోతులు, కుక్కల బెడదను నివారించడం జరుగుతుందని చైర్ పర్సన్ తెలిపారు. వార్డులలో ఏ సమస్య వచ్చిన ఆయా వార్డు కౌన్సిలర్లు తనతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, వాటిని సత్వరమే పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం 23 ఎజెండా అంశాలను నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. ప్రధానంగా వీధి దీపాల ఏర్పాటు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీ ల ప్రక్షాళన పై ప్రధానంగా చర్చించారు. ఇటీవల మృతి చెందిన నలుగురు కాంట్రాక్ట్ కార్మికులకు సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కమిషనర్ గణేష్,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు ప్రజలకు అండగా దండు సారయ్య

- సైబర్ కేసు నమోదైన యువకుడి వెన్నంటే ఉన్న కౌన్సిలర్
- మధ్యప్రదేశ్ పోలీసులకు నగదు చెల్లించిన సారయ్య
- సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచన



**ఇల్లందు, మార్చి 26, ప్రజాజ్యోతి:** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఎక్కడో ఒక దగ్గర ఎవరో ఒకరు మోసపోతూనే ఉన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలకు హద్దు అదుపు లేకుండా పోతుంది. పోలీస్ అధికారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పదేపదే సూచిస్తున్నప్పటికీ ఆ నేరాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఇదే ఇదే తరహాలో ఇల్లందులో యువతకు కమిషన్ల పేరుతో మభ్యపెట్టి ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపించి వారి పేర్లపై పలు బ్యాంకులలో ఎకౌంట్లు తెరవడం జరుగుతుంది. ఇందులో మధ్యవర్తిగా కొంతమంది సైబర్ దళారులు వారి అకౌంట్లో నల్లధనాన్ని వేసుకోని ఏటీఎం కార్డుల ద్వారా ఆ డబ్బులను విద్యుత్ చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన నాదెండ్ల పూర్ణాచారి సాయి అనే యువకుడు పేరుపై పది ఎకౌంట్లు సైబర్ నేరగాళ్లు తెరిచి మూడు బ్యాంకులకు రూ లక్షకు పైచిలుకు పంపించడం జరిగింది. దింతో గురువారం సాయి అనే యువకుడిపై సైబర్ క్రైమ్ నమోదు కావడం, అతనికి అరెస్టు వారెంట్ వల్ల మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు ఇల్లందు పోలీస్ స్టేషన్ కు రావడం జరిగింది. దీంతో ఇల్లందు పోలీసులు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ముందస్తు జాగ్రత్తతో ఆ యువకుడి జీవితం అంధకారం కావద్దని ముందు చూపుతో సాయి అనే యువకుడి పేరుపై ఉన్న మూడు ఎకౌంట్ లకు వచ్చిన రూ. 1.55 లక్షలను ఇల్లందు పోలీస్ స్టేషన్ లో మధ్యప్రదేశ్ పోలీసులకు అప్పగించడం జరిగింది. అదేవిధంగా సీజింగ్ నోటీస్ కూడా తీసుకున్నారు. ఇల్లందు యువత, ప్రజలు సైబర్ నేరగాళ్లు చెప్పే మాయ మాటలు, డబ్బులను ఎలాగా చూపిస్తే నమ్మి మోసపోవద్దని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఆధార్ కార్డు, పాన్ కార్డు ఎవరికి ఇవ్వవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల వల్ల కేసు నమోదు జీవితం అంధకారం అయ్యే విషయంలో అండగా వచ్చి మధ్యప్రదేశ్ పోలీసులకు నగదు చెల్లించిన 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యను పట్టణ ప్రజలతో పాటు 13వ వార్డు ప్రజలు అభినందిస్తున్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవానికి అంతా సిద్ధం

- వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన ఉత్సవ విగ్రహాల సమర్పణ
- వైభవంగా పూజా కార్యక్రమాలు, తలంబ్రాలు నిర్వహణ







**అన్నపురెడ్డిపల్లి, మార్చి 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని రామాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా నూతన ఉత్సవ విగ్రహాలను వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయానికి సమర్పించారు. ఈ విగ్రహాలను వేద సంకల్ప ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి రాజశేఖర్ రెడ్డి, అన్నపురెడ్డిపల్లి గ్రామస్తులు హైదరాబాదులో నిర్వహిస్తున్న ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. అనంతరం విగ్రహాలకు పాలాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.గురువారం ఉదయం మంగళ తోరణాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం అభిషేకాలు చేశారు. తరువాత సంప్రదాయ పద్ధతుల్లో స్వామివారిని పెళ్లికొడుకు కార్యక్రమంగా నిర్వహించి, పసుపుకొట్టుడు పూజలు ప్రారంభించారు. అనంతరం తలంబ్రాలు కలపడం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తలంబ్రాలు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గురువారం నిర్వహించిన అన్ని కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.శుక్రవారం జరగబోయే ధ్యాన మహోత్సవం మరియు స్వామివారి కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. భక్తుల కోసం గ్రామ పెద్దలు, భక్తులు సహాయ సహకారాలతో మహా అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమాల నిర్వహణలో రామాలయం కమిటీ సభ్యులు బొంకూరు సురేష్, ఇనుగంటి శ్యామ్, ఇజ్జగిరి సత్యనారాయణ, చిల్లపల్లి వెంకటేశ్వర్లు, నాగళ్ళ నరసింహారావు, గ్రామ పెద్దలు పాల్గొని ఏర్పాట్లు చేపట్టారు.

## మండల కేంద్రంలోని హాస్టళ్లలో స్పెషల్ ఆఫీసర్ తనిఖీలు

- ఎస్టీ, బీసీ బాయ్స్ హాస్టళ్లు, ఎం జె పి డిగ్రీ జూనియర్ కళాశాల హాస్టల్‌లో సదుపాయాల పరిశీలన
- భోజనం, పరిశుభ్రత, స్టోర్ రూములు, టాయిలెట్లపై సూచనలు





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని హాస్టళ్లలో గురువారం మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ భారతి, ఎంపీడీవో మహాలక్ష్మి కలిసి తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్టీ బాయ్స్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టల్, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర డిగ్రీ మరియు జూనియర్ కళాశాల హాస్టల్ లను సందర్శించారు. మొదట ఎస్టీ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజన వసతులు, వంటగది నిర్వహణ, నిల్వ గదులను పరిశీలించారు. ఆహారం నాణ్యత మెరుగుపరచాలని, విద్యార్థులకు సమయానికి భోజనం అందించాలని సూచించారు.తదుపరి బీసీ బాయ్స్ హాస్టల్‌ను పరిశీలించి, స్టోర్ రూములు, టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలపై దృష్టి సారించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.అనంతరం మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర డిగ్రీ మరియు జూనియర్ కళాశాల హాస్టల్ ను సందర్శించి, విద్యార్థుల వసతి పరిస్థితులు, భోజన సదుపాయాలను పరిశీలించారు. హాస్టల్‌లో భోజన నాణ్యత, స్టోర్ రూమ్ నిర్వహణ, టాయిలెట్ల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బూరాన్ వివరాలు తెలియజేశారు.మూడు హాస్టళ్లలోనూ టాయిలెట్లు, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను సమీక్షించి, లోపాలు ఉన్న చోట వెంటనే సరిచేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా శుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలి

- సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 26,ప్రజా జ్యోతి:** అమెరికా ఇరాన్ పై యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు నిత్యవసర వస్తువు ధరలు సామాన్యుడికి అందుబాటులో కి పాలక ప్రభుత్వాలు తీసుకురావాలని, పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ అందుబాటులో లేనందున గత పది సంవత్సరాల క్రితం ఏదైతే కట్టెల పోయి వాడారో మళ్ళీ ప్రజలు కట్టెల పొయ్యికి అలవాటు పడే విధానాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా గ్యాస్ ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు, కొంతమంది దళారులు గ్యాస్ సిలిండర్ స్టోరీ చేసి 2000 నుంచి 3000 వరకు బ్లాక్ లో అమ్ముతున్నారన్నారు, చిరు వ్యాపారం సాగించే చిన్న చిన్న హోటల్స్ టీ స్టాల్స్ బజ్జీల బండ్లు గ్యాస్ కొనలేక కట్టెల దొరక పస్తుల ఉండే పరిస్థితి ఏర్పడుతుందనీ ,పేద ప్రజలు గ్యాస్ కొనలేక.కట్టెలు లేక కొన్ని కుటుంబాలు పస్తులు ఉంటున్నాయనీ కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కొరతని నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అదేవిధంగా రోజురోజుకు పెరుగుతున్న ఉప్పు పప్పు నూనె బియ్యం ఉల్లిగడ్డలు చింతపండు అనేక వస్తువులు ధరలు పేద కుటుంబాలకు అందుబాటులో లేనందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులు ద్వారా కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి నిత్యవసర వస్తువు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**దమ్మపేట,మార్చ్. 26(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలం,రంగువారిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాగి ముక్తేశ్వరావు, రాజేశ్వరి దంపతుల కుమారుడు,కుమార్తె ఓణీలు ,పంచల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకలో మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్, మాజీ సర్పంచ్‌లు అల్ల జంగం, ఊకే వెంకటేశ్వరావు తదితరులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.అనంతరం బీఆర్ఎస్ మండల నాయకుడు అబ్దుల్ జిన్నా మాతృమూర్తి జాన్బి మరణించిన సందర్భంగా మెచ్చా నాగేశ్వరావు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణం చూద్దాం రారండి..

(మొదటి పేజీ తరువాయి...)
పాటు దేశ నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు భద్రాచలానికి తరలివచ్చారు.

**»› మిథిలా స్టేడియంలో సిద్ధమైన కళ్యాణ వేదిక...**

కళ్యాణ వేడుక కోసం మిథిలా స్టేడియంలోని శిల్పకళా శోభిత మండపం సిద్ధమైంది. ఈ వేదికపై స్వామివారి కల్యాణ తంతు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**»› సీఎం రేవంత్ రెడ్డి రాక ...**

నేడు భద్రాచలానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు విచ్చేయనున్నారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు పాల్గొననున్నారు. అదేవిధంగా భద్రాచలం అభివృద్ధికి రూ.586 కోట్లతో పలు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. 1960 తర్వాత ఈ స్థాయిలో దేవస్థానానికి నిధుల ప్రవాహం రావడం విశేషంగా భావిస్తున్నారు.

**»› భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు ...**

మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. కళ్యాణ వేడుకలను వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటు చేసి, ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక అధికారులను నియమించారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి సెక్టార్‌లో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**... తలంబ్రాలు, ప్రసాదాల పంపిణీ ...**

కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తలంబ్రాలు, లడ్డూలు పంపిణీ కోసం 70 కౌంటర్లు ఏర్పాటు చేశారు. సుమారు 200 క్వింటాళ్ల తలంబ్రాలు, 2 లక్షల లడ్డూలు సిద్ధం చేశారు. మొత్తం 17 వేల మంది భక్తులు మిథిలా స్టేడియంలో కళ్యాణాన్ని వీక్షించే అవకాశం కల్పించారు.

**»› వైద్య, భద్రతా సదుపాయాలు ....**

అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్సులు, వైద్య కేంద్రాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలు, పరికరాలు సిద్ధం చేశారు. భక్తులకు సుమారు 3 లక్షల తాగునీటి ప్యాకెట్లు, లక్ష మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

**»› ట్రాఫిక్ ఆంక్షలు, భారీ బందోబస్తు ...**

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మార్చి 27, 28 తేదీలలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. భారీ వాహనాలు పట్టణంలోకి అనుమతించబడవని, మిథిలా స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా భద్రాద్రిలో నేడు జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివస్తుండగా, క్షేత్రం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది.

# ఇదేం పనయ్య ప్రశాంత్..!

(మొదటి పేజీ తరువాయి...)
ఆలస్య కావడం తో కొన్ని సంవత్సరాల పాటు సవ్యంగా ఉన్న సంబంధాలు ఇటీవల విభేదాలకు దారి తీశాయని పేర్కొన్నారు. ఇప్పటికే అమ్మిన ఇంటిపై తిరిగి హక్కు కోరుతూ ప్రశాంత్ కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. బయటి వ్యక్తుల ప్రేరణతో సొంత కుటుంబ సభ్యులపైనే కేసులు పెట్టి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు.



**»› కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఇంట్లోకి చొరబాటు?**

కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెబుతూ తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రశాంత్ బలవంతంగా ప్రవేశించాడని బాధితులు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇంటి పరిస్థితి యథాతథంగా ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. అంతేకాకుండా ప్రశాంత్ సతీమణి ఎస్సీ వర్గానికి చెందినదని పేర్కొంటూ కొంతమంది మహిళా సంఘం నేతలను తీసుకువచ్చి బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపారు. కుల సంఘం మహిళా నేతలు ఆస్తి సెటిల్మెంట్ కోసం ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.



**»› ఆస్తి తగాదాలో తలదూర్చి బెదిరింపులకు పాల్పడిన కుల సంఘ మహిళా నేతలు**

ఈ ఘటనలో కుల వివక్ష అంశం కూడా ముందుకు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎస్సీ/ఎస్టీ చట్టాలను అడ్డంగా పెట్టుకుని బీసీ కుటుంబాన్ని ఎస్సీ కుల మహిళా సంఘం నేతలు బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం ఎస్సీ కుల సంఘానికి చెందిన కొంతమంది మహిళా నేతలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఘటన స్థలంలో హడావుడి సృష్టించినట్లు తెలిపారు. ఆస్తి విషయంలో సెటిల్మెంట్ కు రావాలని బాధిత కుటుంబాన్ని ఒత్తిడికి గురిచేస్తూ ప్రశాంత్ కు మద్దతుగా నిలిచినట్లు పేర్కొన్నారు. ప్రశాంత్ భార్య దళిత కుటుంబానికి చెందినదని పేర్కొంటూ "మా కులానికి చెందిన మహిళకు ఇల్లు చెందాలి" అంటూ బాధితులను బహిరంగంగా బెదిరించినట్లు ఆరోపించారు. చెప్పిన మాట వినకపోతే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా అక్కడ వాగ్వాద వాతావరణం నెలకొన్నట్లు సమాచారం. కోర్టు ఉత్తర్వులు ఉన్న సందర్భంలో చట్టపరంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నప్పటికీ, పదుల సంఖ్యలో మహిళలు సంఘటన స్థలానికి చేరుకుని హడావుడి చేయడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే అమ్ముకున్న ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిని కొందరు సంఘాలు ప్రోత్సహిస్తున్నాయని వారు విమర్శించారు. ఇలాంటి సంఘటనలు కొనసాగితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని, కుల సంఘాల పేరుతో సెటిల్మెంట్ లు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**»› పోలీసుల హెచ్చరికలను పట్టించుకోలేదా?**

పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నప్పటికీ, ఇంట్లో చొరబడిన వ్యక్తిని బయటకు తీసుకురావడంలో విఫలమైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చట్టవిరుద్ధంగా ఇంట్లోకి ప్రవేశించాడని స్పష్టంగా తెలియజేసినా తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ గొడవలు చెలరేగే పరిస్థితి ఉందని పలుమార్లు తెలియజేసినా పోలీసులు స్పందించకుండా మౌనం పాటిస్తూ వెళ్లిపోయారని పేర్కొన్నారు. దీంతో స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసుల నిర్లక్ష్యానికి కారణమేంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడైనా రాజకీయ ఒత్తిళ్లు లేదా కుట్ర ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నిజానిజాలు వెలికి తీయాలని స్థానికులు కోరుతున్నారు.

**»› మాకు న్యాయం చేయండి మహాప్రభో: బాధిత కుటుంబం ఆవేదన**

ఇప్పటికే అమ్ముకున్న ఆస్తిపై తిరిగి హక్కులు కోరుతూ కుల సంఘాల మద్దతుతో తమపై ఒత్తిడి తెస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఇంట్లోకి చొరబడటం చట్టానికి విరుద్ధమని తెలిపారు. తమపై మానసిక వేధింపులు, భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కుటుంబ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్ష పేరుతో ఇలాంటి బెదిరింపులు కొనసాగితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిజానిజాలు వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## సీతారాముల సౌభాగ్య సౌరభం

### భద్రాచలంలో భక్తి భరిత ఎదుర్కోలు వైభవం









**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి ):** "అయోధ్య ఆరాధ్యుడు... మిథిల మంగళమూర్తి... కలిసిన క్షణమే కల్యాణ కాంతి" అన్నట్లుగా శ్రీ సీతారాముల దివ్య సన్నిధి భద్రాచలంలో భక్తి తరంగాలను అలలెత్తించింది. వసంతపక్ష నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. ఈ వేడుకను తిలకించేందుకు భద్రాద్రికి తరలివచ్చిన అశేష భక్తజనుల జయజయధ్వనులతో పుణ్యక్షేత్రం పులకరించింది. ఈ సందర్భంగా స్వామివారిని సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువు దీర్చి మంగళ వాయిద్యాల మధ్య ప్రధాన ఆలయం నుంచి మిథిలా స్టేడియం ముఖద్వారం వరకు ఘనంగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. వైకుంఠ ద్వారం వద్ద శ్రీరామచంద్రుడు, సీతమ్మ తల్లిని ఎదురెదురుగా ఆసీనులను చేసి సంప్రదాయబద్ధంగా ఉత్సవాన్ని నిర్వహించారు. రామచంద్రుని తరపున గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు, సీతమ్మ తరపున స్థానాచార్యులు కేఈ స్థలసాయి ప్రాతినిధ్యం వహిస్తూ, అయోధ్య నుంచి రాముడు, మిథిల నుంచి సీతమ్మ వచ్చినట్లుగా భావ వైభవంతో వర్ణనలు చేశారు. సీతారాముల గుణగణాలు, సౌందర్యం, వంశ గౌరవాన్ని పరస్పరం పొగడ్తలతో వివరిస్తూ కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. "ధర్మానికి దర్పణం రాముడు... దయకు రూపం సీతమ్మ" అన్న సందేశం ప్రతిధ్వనించింది. దాంపత్యంలో ధర్మం, సహనం, పరస్పర గౌరవం ప్రాముఖ్యతను సీతారాముల జీవితం చాటి చెబుతుందని ఆచార్యులు వివరించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ నృత్యాలతో మాలా పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తుల కరతాళధ్వనులతో ప్రాంగణం మార్మోగింది. అనంతరం స్వామివారిని పక్కపక్కన ఆసీనులను చేసి ప్రత్యేక హారతిని సమర్పించారు. ఈ సందర్భంగా జీయర్ మఠం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ అధికారులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తి, భావం, భరితం కలిసిన ఈ దివ్య ఎదుర్కోలు ఉత్సవం భద్రాచలాన్ని ఆధ్యాత్మిక కాంతితో నింపింది.